క్లుప్తంగా

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పాయకపాడులో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు అధికారి నారాయణరావు

మక్కువ: మండలంలోని పాయకపాడు, మేలాపువలస, గోచెక్క గ్రామాల్లో శుక్రవారం మక్కువ అటవీశాఖ అధికారి కె.నారాయణ రావు ఆధ్వర్యంలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అడవులకు నిప్పు పెట్టారాదని, అగ్గిపెట్టెలు, సిగరెట్లు తీసుకెళ్లకూడదని, అడవులను, వణ్య ప్రాణులని రక్షించుకోవాల్సిన భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది కె.గణపతి, రమణ, సతీష్, సూర్యనారాయణ, పాలొన్నారు

సందర్శన

పార్వతీపురం టౌన్: మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి ఎంపీపీ పాఠశాలలను ఎంఈఓ -1 సామల సింహాచలం శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల డైరీలు, లెస్సన్ ప్లాన్‌లను పరిశీలించారు. చినబొండపల్లి పాఠశాలలో చేతిరాతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నారాయణ స్వామి, సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయిస్తున్న ఉపాధ్యాయుడు

బలిజిపేట: పిల్లలకు ఆధ్యాత్మిక చింతన అవసరమని గళావల్లి పంచాయతీ గేదెలపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించి, సూర్యనమస్కారాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఏఆర్ డీఎస్పీ



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఆర్ డీఎస్పీ వెంకట అప్పారావు

పార్వతీపురం టౌన్: ఇటీవల ఏఆర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. వెంకట అప్పారావు ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పారావు ఇంతవరకు కాకినాడ డీఏఆర్‌లో విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పార్వతీపురం జిల్లాకు బదిలీపై వచ్చారు.

ప్రజారోగ్యానికే.. సురక్ష



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

సాలూరు రూరల్: ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజారోగ్యం కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారని రోగులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఫణీంద్రకుమార్ అన్నారు. మరిపల్లి సచివాలయం వద్ద శుక్రవారం వైద్యాధికారి అజయ్ ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన రోగులతో మాట్లాడారు. సురక్ష శిబిరాలకు వచ్చి ఆరోగ్య తనిఖీలు జరిపించుకొనేలా చూడాలన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం శిబిరానికి వచ్చి తనిఖీలు చేసుకుంటున్న వారితో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రికి పంపించాలన్నారు. ఈఓపీఆర్డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం

సీతానగరం: పేద ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పావని అన్నారు. భగ్గేంద్రవలసలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలవురు రోగులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరావు, ఎస్‌వీ రమణ, వైద్యులు రాజేంద్ర ప్రసాద్, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పెదంకలాంలో... జోరందుకున్న అభివృద్ధి..

- లక్షలాది రూపాయలతో ప్రభుత్వ భవనాలు
- సీసీ రోడ్లు, రహదారుల ఏర్పాటు
- పాఠశాలలో మౌలిక సదుపాయాలు
- కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి



పెదంకలాంలో నిర్మించిన సచివాలయం.



ఆధునీకరించిన పీహెచ్‌సీ భవనం



ఆర్‌బీకే భవనం.

సీతానగరం: మండలంలోని పెదంకలాం గ్రామం అభివృద్ధి దిశగా సాగుతోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు అన్ని సేవలూ గ్రామంలోనే లభిస్తున్నాయి. రూ. 43 లక్షలతో సచివాలయ భవనం, రూ. 23 లక్షలతో ఆర్‌బీకే భవనాలు నిర్మించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే ఉద్దేశంతో నాడు -నేడులో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. చాలా మంది పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయడంతో సొంతంటి కల నెరవేరింది. సుజల ధార పథకం నిధులు రూ. 50 లక్షలు, జేజేఎం నిధులు రూ. 15 లక్షలతో ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పించారు. అలాగే రూ. 8 లక్షలతో కల్వర్టులు నిర్మించారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో గ్రామంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం..

ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు పలు సమస్యలను గురించి పరిష్కరించారు. రూ. 20 లక్షలతో సీసీ కాలువలు, రోడ్లు వేశారు. మరో 15 లక్షల రూపాయలతో రోడ్ల మరమ్మతులు, తదితర పనులు.. రూ. 30 లక్షలతో పీహెచ్‌సీ భవనం ఆధునీకరణ పనులు చేపట్టారు. అలాగే దీర్ఘకాలంగా అసంపూర్తిగా ఉన్న మంచినీటి ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను పునరుద్ధరించారు.

సొంతింటి కల నెరవేరింది..



గత ప్రభుత్వం ఇల్లు ఇస్తామని చెప్పినా హామీలకే పరిమితమైంది. ఎన్నికల సమయంలో జగనన్న ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రాగానే ఇంటిస్థలం ఇవ్వడం, ఇల్లు నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారు. దీంతో సొంతిల్లు నిర్మించుకున్నాను. మా కుటుంబానికి అండగా నిలిచిన జగనన్నకు తామంతా రుణపడి ఉంటాం.

– పసుపురెడ్డి శంకరరావు లబ్ధిదారుడు, పెదంకలాం

అభినందనీయం......



గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయం. ప్రజలను పట్టి పీడిస్తున్న మంచినీటి సమస్య పరిష్కరిచడంతో పాటు కాలువలు నిర్మించడంతో చాలా సమస్యలు తీరినట్టింది. సొంత గూడు లేనివారికి ఇళ్లు మంజూరు చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– వంగపండు పరశురాం, పెదంకలాం, సీతానగరం మండలం

జగనన్న ప్రభుత్వానికి అండగా ..



రాష్ట్ర ప్రభుత్వం సుజల ధార నిధులు విడుదల చేయడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ప్రభుత్వ పాలన ప్రజల వద్దకు తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో ఉన్న ఊరిలోనే సేవలన్నీ లభిస్తున్నాయి. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు అండగా ఉంటాం.

– బలగ వెంకటనాయుడు, రైతు, పెదంకలాం, సీతానగరం.మండలం



ఓవర్‌హెడ్ ట్యాంక్

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు



సంగంవలస గ్రామంలో సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పార్వతీపురం టౌన్: మండలంలోని సంగంవలస, వెంకంపేట, ఎమ్మార్ నగరం, తదితర గ్రామాల్లో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్య భగవానుడికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి ఏటా రథసప్తమి రోజున పూజలు నిర్వహించడం ఆనవాయితీ వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

108 యోగాసనాలు

పట్టణంలో ఉన్న సూర్యపీఠంలో రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సూర్య యోగా శిక్షణ కేంద్రం, సూర్యపీఠం సమైక్యంగా నిర్వహించిన కార్యక్రమంలో యోగా విద్యార్థులు 108 యోగాసనాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీరు నగేష్‌రెడ్డి, సూర్యపీఠం అధిపతి నరహరిశాస్త్రి, చిన్నపిల్లల వైద్యుడు భోగేశ్వరరావు, యోగా గురువు మోహన్, భక్తులు పాల్గొన్నారు.

మోదీ విధానాలపై నిరసన



సాలూరు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

సాలూరు: ప్రధానమంత్రి మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో రాజేశ్వరరావు పార్కు నుంచి డీలక్స్ సెంటర్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉన్న మోదీ ప్రభుత్వ పాలనపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను విస్మరించి అంబానీ, అదానీ వంటి కార్పొరేట్‌లకు ప్రభుత్వ సంపదను మోదీ ప్రభుత్వం దోచి పెడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు 'జగనన్న పచ్చతోరణం'



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా వాడవాడలా మొక్కలు నాటి సంరక్షించడం వల్ల ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చని ఎమ్మెల్యే అలజంగి జోగరావు అన్నారు. పార్వతీపురం బైపాస్ ప్రధాన రహదారికి ఇరువైపులా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగరాల్లో కూడా విరివిగా మొక్కలు నాటి ప్రకృతి సమతుల్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రజలకు చల్లని, చక్కటి వాతావరణం అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న పచ్చతోరణం కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ సి. సింహాచలం, స్థానిక కౌన్సిలర్ సభ్యులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామంలో రూ. 43 లక్షలతో నిర్మించిన సచవాలయ భవనాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్లెలను ప్రగతిపథంలో నడిపేందుకు కంకణం కట్టుకున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోనూ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బలగ రమణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జి, పార్టీ మండల అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, బలగ శ్రీరాములనాయుడు, ఎం. ఈశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో వివిధ హోదాల్లో జిల్లాకు చెందిన పలువురుని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్టేట్ ఎస్టీ సెల్ కమిటీ	
హోదా	పేరు
జోనల్ ఇన్‌చార్జ్	సీర బీమారావు
జనరల్ సెక్రటరీ	చోడి ఆనందరావు
జాయింట్ సెక్రటరీ	గేదెల కోటేశ్వరరావు
స్టేట్ లీగల్ సెల్ కమిటీ	
సెక్రటరీ	కల్పనా సూర్యప్రకాశరావు
జాయింట్ సెక్రటరీ	ఎం. సంగంనాయుడు

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే అలజంగి



అంబులెన్స్‌కు కాల్ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పట్టణ సమీపంలోని వెంకంపేట గోరీల వద్ద శుక్రవారం ఉదయం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయలయ్యాయి. అదే సమయంలో పార్వతీపురం పట్టణం నుంచి సీతానగరం వెళ్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్షతగాత్రులను చూసి వెంటనే కారు దిగి పరిస్థితి తెలుసుకున్నారు. 108 వాహనానికి ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ చేశారు. అయితే అంబులెన్స్ రావడానికి సమయం పట్టే అవకాశం ఉండడంతో స్థానికులు, పోలీసుల సహకారంతో క్షతగాత్రులను ఆటోలో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. సకాలంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. దీంతో ఎమ్మెల్యేను పలువురు అభినందించారు.

వేతనదారులతో సమావేశం

సీతంపేట: ఎంఎస్ఆర్ఈజీఎస్ రోజ్‌గార్ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కిరపలో ఉపాధి హామీ వేతనదారులతో ఎంపీడీఓ కె.గీతాంజలి శుక్రవారం సమావేశం నిర్వహించారు. వంద రోజుల పనిదినాలు, జాబ్ కార్డుల అప్డేట్ గూర్చి చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

పార్వతీపురం టౌన్: జాతీయ లోక్‌అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు అన్నారు. జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణలో భాగంగా పోలీసు అధికారులతో శుక్రవారం ఆయన స్థానిక కోర్టు భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ కావడం వల్ల ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ. రమేష్, అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి. సౌజన్య, ఎన్. శ్రీనివాసరావు, ఏపీపీ చంద్రకుమార్, జి. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పేద మహిళల సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పురపాలక సంఘానికి చెందిన అక్కచెల్లెమ్మలకు మంజూరైన ఇంటి పట్టాలను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అందరికీ స్థలాలు కేటాయించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి ఉచితంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించారని తెలిపారు. దీంతో ఆ ఇంటిపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కలుగుతాయని చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తున్న ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేసీబీని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి



జేసీబీని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ విభాగంలో ఇటీవల కొనుగోలు చేసిన జేసీబీని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జెండా ఊపి జేసీబీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు మరింత వేగవంతవయ్యేందుకు జేసీబీ దోహదపడుతుందన్నారు. అభివృద్ధి పనులు త్వరితంగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి, జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులే వలంటీర్లు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ ప్రమీల, ఇతర ప్రజాప్రతినిధులు

పాచిపెంట: రాష్ట్రంలో వాలంటీర్లు ప్రజలకు – ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ సేవలు అందిస్తున్నారని ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. మండలంలోని రాయిగుడ్డివలస, గొట్టూరు సచివాలయాలకు సంబంధించి రాయిగుడ్డివలసలో శుక్రవారం నిర్వహించిన వాలంటీర్ల వందనం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవాభావంతో వాలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, సర్పంచ్‌లు చింత సీతయ్య, సోముల లచ్చయ్య, ఈఓపీఆర్‌డీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.